క్లుప్తంగా

పారిజాతగిరిలో పూజలు


విశేషాలంకరణలో శ్రీవేంకటేశ్వర స్వామి

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో మొదలుకుని ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్టి తదితర పూజలు అర్చకులు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. జంగారెడ్డిగూడెంకు చెందిన జయవరపు సోమశేఖర్, సీహెచ్ మంగరాజు, టీవీ నగేష్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను అభివృద్ధి కమిటీ సభ్యులు కంది బాలకృష్ణారెడ్డి, రెడ్డి రంగప్రసాద్, వాసవీ సాయి నగేష్, బి.రవీందర్, ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

పంచలోహ వినాయక విగ్రహం సమర్పణ


దాత ఉదయ్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయానికి పంచలోహ వినాయక ఉత్సవ విగ్రహాన్ని యర్రం ఉదయ్‌కుమార్, గీతా అలివేలు మంగతాయారు దంపతులు సమర్పించారు. తొలుత వీరు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయ్‌కుమార్ దంపతులకు ప్రధానార్చకులు సుదర్శనం వేణుగోపాల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేదాశీర్వచనం అందించి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మారిశెట్టి రాధాకృష్ణ, మాదా రామ్మోహనరావు, సంయుక్త కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాత సుబ్బారావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు మండలంలోని రామన్నగూడెం పంచాయతీ నాగేశ్వరరావు మెట్టకు చెందిన ఆవుల సుబ్బారావు శనివారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నేటినుంచి అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెంలో వేంచేసియున్న శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం 10వ వార్షిక వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా 2వ తేదీన గణపతిపూజ, గోపూజ, అఖండ దీపారాధన, 3న మహా పడిపూజా మహోత్సవం, 4న మధ్యాహ్నం 11.30 నుంచి అన్నసమారాధన, 3 గంటల నుంచి గురవాయిగూడెం, జంగారెడ్డిగూడెం పురవీధుల్లో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు అల్పాహారం

పోలవరం రూరల్ : గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం, పెన్నులను శనివారం మానవత సభ్యులు అందజేశారు. మానవత అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం పరీక్షా సమయం కావున తమవంతుగా విద్యార్థులకు అల్పాహారం అందించినట్లు చెప్పారు. రీజనల్ చంద్రయ్య, సెక్రటరీ సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు రాఘవన్, ఉపాధ్యాయులు హనుమంతరావుశర్మ, సత్తిబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు

అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్‌లో ఉన్న శ్రీసీతారామస్వామి ఆలయంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ప్రారంభించారు. అధిక సంఖ్యలో ప్రజలు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం శ్రీసీతారామస్వామి గ్రామోత్సవాన్ని పట్టణంలో నిర్వహించారు.

ఏజెన్సీలో వర్షం

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ కొద్దిపాటి మబ్బులున్నప్పటికీ ఉక్కపోత మాత్రం విపరీతంగా ఉంది. ఆ తరువాత ఒక్కసారిగా మబ్బులు కమ్మి సుమారు గంట సేపు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. కొండప్రాంతాల్లో భారీ వర్షం పడింది. మిగిలిన ప్రదేశాల్లో ఒక మోస్తారు వాన పడింది.

ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- మున్సిపల్ పరిధిలోని డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం : ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని, అందుకు అవసరమైన ఆర్థిక చేయూతను అదించేందుకు రాష్ట ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషిచేస్తోందని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆలపాటి గంగాభవానీ కళ్యాణ మండపంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలోని డ్వాక్రా మహిళలకు 3వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా, మహిళా సంక్షేమం కోసం పాటుపడుతున్నారన్నారు. అక్కచెల్లెమ్మలను ఆదుకునేందుకు నవరత్నాల పథకాలలోను, మేనిఫెస్టోలోను మహిళల అభ్యున్నతికి స్థానం కల్పించి అమలు చేశారన్నారు. మేనిఫెస్టోను ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి అమలు చేశారన్నారు. ఇప్పటి వరకు వైఎస్సార్ ఆసరా పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.19 వేల కోట్లకు పైగా మహిళలకు అందజేశారన్నారు. నాలుగు విడతలుగా కలిపి ఈ పథకంలో రూ.25,570 కోట్లు మహిళలకు అందనున్నాయన్నారు. ఇతర రాజకీయ పార్టీల మాదిరిగా కాకుండా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూటికి నూరుశాతం అమలు చేశారన్నారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా మాట తప్పకుండా, అక్కచెల్లెమ్మలను ఆదుకున్న ఏకైక వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. మళ్లీ త్వరలో రానున్న ఎన్నికల్లో మోసం చేసేందుకు ప్రతిపక్షాలు వస్తున్నాయని వాటిపట్ల మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తొలుత కార్యక్రమంలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం ఆసరా పథకం ద్వారా మహిళలను ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌కు మహిళలంతా ముక్తకంఠంతో ధన్యవాదాలు తెలిపారు. అలాగే సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్‌ను కట్ చేసి అందరికి పంచారు. నవరత్నాలను సూచించే విధంగా మహిళలు వేసిన ముగ్గు ఆకట్టుకుంది. అనంతరం మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్ వందనపు సాయిబాల పద్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు పి.గిరిబాబు, బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యుడు, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, మేనేజర్ కొమ్మినేని రమణ, మెప్మా టీఎంసీ మోహన్, సీవోలు ఈ.రాధ, వాసు, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

జంగారెడ్డిగూడెంలో మున్సిపల్ పరిధిలో శనివారం నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు, సోదరీమణులు అయిన టి.లక్ష్మి వెంకట దుర్గ, టి.ప్రవల్లిక కూచిపూడి ప్రదర్శన చేశారు. అలాగే మెప్మా రీసోర్స్ పర్సన్‌లు నవరత్నాలపై పాటను రచించి, ఆ పాటకు జగనన్న చిత్రపటాన్ని పెట్టి చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రదర్శనలను పలువురు అభినందించారు. ఎమ్మెల్యే ఎలీజా కూచిపూడి నృత్యప్రదర్శన చేసిన విద్యార్థినులకు, కోలాట ప్రదర్శన చేసిన మెప్మా రీసోర్స్ పర్సన్‌లకు బహుమతులను అందజేశారు.

అస్వస్థతకు గురైన మహిళకు ఎమ్మెల్యే పరామర్శ

ఆసరా చెక్కుల పంపిణీలో ఒక మహిళ అస్వస్థతకు గురైంది. చేబ్రోలు వరలక్ష్మి అనే మహిళ ఎటువంటి ఆహారం తీసుకోకుండా కార్యక్రమానికి హాజరు కావడంతో నీరసించి కళ్లు తిరిగిపడిపోయింది. ఇది గమనించిన హెడ్ కానిస్టేబుల్ జె.భీమశంకరం పోలీసు వాహనంలో ఆమెను హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించేలా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే ఎలీజా ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న వరలక్ష్మిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమలను ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించి పూర్తిగా కోలుకున్న తరువాత డిశ్చార్జి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ వైద్యసేవలకు, పౌష్టికాహారం అందించేందుకు రూ.2 వేలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్ వందనపు సాయిబాల పద్మ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత


రాజవరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేసిన పూర్వ విద్యార్థులు

కొయ్యలగూడెం : రాజవరం జెడ్పీ హైస్కూల్లో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1993–94 నాటి టెన్త్ బ్యాచ్ విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు నాగబాబు, ఫణికుమార్ బీవీ రావు, రామకృష్ణ, బలే నాగేశ్వరరావు రూ.5 వేల విలువైన పరీక్షా సామగ్రిని అందజేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గ్రేడులు సాధించాలని ఆకాంక్షించారు.

జాతీయ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక


సత్కారం అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

కామవరపుకోట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నం ప్రశాంత్ కుమార్ తెలిపారు. విద్యార్థులు పాలిమెట్ల జీవన్ సాత్విక్, రాఘవ దుర్గాహర్షిత, బందుల ప్రతున్, కుదరపల్లి కీర్తి, ఎర్రసాని ఎస్తేరురాణి, వనమా పూర్ణిమ, కలకంటి స్వాతి, గోదా సంజన స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పండు జగదీష్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు మళ్ల మారుతి, శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

వైద్య శిబిరాలను గ్రామీణ ప్రజలు వినియోగించుకోవాలి


శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

చింతలపూడి : ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ ఫ్లోర్ విప్, వైఎస్సార్ సీపీ నాయకులు కలకొండ రాంబాబు అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో శనివారం స్థానిక సాయి స్ఫూర్తి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీతానగరం పంచాయతీతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాయం మల్లేశ్వరి, దన్నపనేని సాంబ శివరావు, తాంద్ర సురేష్, ఆలూరి శ్యాంబాబు, వల్లెపు పుల్లారావు, దేవరకొండ కృష్ణ, గెడ్డమడుగు రాజేష్ నాయుడు, గోలి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం శ్రీవారి ఏకాదశి ఉత్సవం


తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల : శ్రీవారి ఏకాదశి ఉత్సవం శనివారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు తొళక్క వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ స్వామివారి వాహనం ఆలయ ప్రధానరాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిటకు వచ్చిన స్వామివారికి భక్తులు నీరాజనాలు సమర్పించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్య భద్రత


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ చిరుధాన్యాల ద్వారా మంచి పోషకాలు లభించడమే కాకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. దీనిలో భాగంగానే ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పౌష్టికాహారం అందించే దిశగా కృషి చేస్తున్నామని అన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో వైఎస్సార్ పోషణ పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భవతులతో పాటు పిల్లలకు పౌష్టికాహారం అందించే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. జొన్నలు, సజ్జలు, రాగులు, శనగలు, వేరుశనగలు, బార్లీ, తదితర చిరుధాన్యాల ఆహార పదార్థాలను వినియోగించుకుని ఆరోగ్యాన్ని సురక్షంగా ఉంచుకోవాలని అన్నారు. శిశు సంక్షేమ శాఖ రీజనల్ చైర్మన్ వందనపు సాయి బాల పద్మ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పౌష్టికాహార లోప నివారణే లక్ష్యంగా కృషి చేస్తున్నారని చెప్పారు. ఐసీడీఎస్ పీడీ కేవీఎల్.పద్మావతి మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 20 నుంచి ఏప్రిల్ 3 వరకూ అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన చిరుధాన్యాల వంటకాలను ఎమ్మెల్యేతోపాటు పలువురు రుచి చూశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, కొవ్వాసి నారాయణ, సర్పంచ్‌లు ఉయికే బొజ్జి, తెల్లం వెంకటలక్ష్మి, ఎంపీటీసీ గాలి దుర్గారావు, ఎంపీడీఓ ఎం. శ్రీహరి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంగుటూరులో ర్యాలీ

కొయ్యలగూడెం : పొంగుటూరులో అంగన్‌వాడీ కార్యకర్త అంబటి సరస్వతి ఆధ్వర్యంలో శనివారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ పీవో యుఎన్ స్వర్ణకుమారి అంగన్‌వాడీ కేంద్రాలలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ప్రారంభించి పక్వాడా కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చిరుధాన్యాలపై అవగాహన, సీమంతాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పామర్తి సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మణికుమారి

చింతలపూడి : ఈనెల 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ మణికుమారి తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు ఉదయం 8.30 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారి జి.రామారావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు కలిపి మొత్తం 1,450 విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

లింగపాలెంలో...

లింగపాలెం : మండలంలోని ధర్మాజీగూడెం, శింగగూడెం హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాలను ఎంపీడీఓ ఎస్.ఆశీర్వాదం, ఎంఈవో కె.రామారావు, ఎస్సై పి.చెన్నారావు శనివారం పరిశీలించారు. పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎంఈవో రామారావు మాట్లాడుతూ లింగపాలెం మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 592 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరుకానున్నాట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు మొత్తం 31 మంది ఇన్విజిలేటర్‌లను నియమించినట్లు ఎంఈవో తెలిపారు.

విద్యార్థులకు అభినందన


సాక్షి స్పెల్‌బీ, సాక్షి మ్యాథ్స్ బీలో విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం : సాక్షి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సాక్షి స్పెల్ బీ, సాక్షి మ్యాథ్స్ బీ పోటీల్లో సత్తా చాటిన పట్టణంలోని ప్రతిభ పాఠశాలలకు చెందిన విద్యార్థులను శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అభినందించారు. భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకునేలా ఈ విజయాన్ని బాటగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతిభ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి వై.భీమా గంగాధర్ గత నెల 30న హైదరాబాద్‌లో జరిగిన స్పెల్‌బీ ఫైనల్‌లో విజేతగా నిలిచి గోల్డ్‌మెడల్, రూ. 8వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందుకోగా, 7వ తరగతికి చెందిన మరో విద్యార్థి వి.ధర్మదినేష్ మ్యాథ్స్ బీలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. విద్యార్థులను ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాతో పాటు ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి, డీఎస్పీ సత్యనారాయణ, ఎంఈవో బి.రాముడు, సీఐ పి.బాలసురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్‌బాబు అభినందించారు.

నాటుసారా తయారీ కేంద్రంపై దాడి


దేవులపల్లిలో దాడులు నిర్వహించిన ఎస్సై దుర్గా మహేశ్వరరావు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని దేవులపల్లిలో నాటు సారా తయారీ కేంద్రంపై పోలీసులు దాడులు చేపట్టారు. ఎస్సై దుర్గామహేశ్వరరావు తన సిబ్బందితో దాడులు నిర్వహించి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే సారా తయారీకి ఉపయోగించే గ్యాస్ స్టవ్, పొయ్యి, అల్యూమినియం సామాన్లు, రెండు ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. బెజవాడ మధును అదుపులో తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు.

చెట్టును ఢీకొన్న ఆటో

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెంలో ఆటో చెట్టును ఢీకొన్న ఘటన శనివారం చోటుచేసుకుంది. జంగారెడ్డిగూడెం వైపు వస్తున్న ఆటో అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులకు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

కొయ్యలగూడెం : గంగవరం గ్రామంలో శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర నాగబంధన ఆలయ నిర్మాణానికి దాతలు రూ.లక్ష విరాళం శనివారం అందజేశారు. గ్రామానికి చెందిన బల్లె వెంకటరత్నం, చెల్లయమ్మ దంపతుల జ్ఞాపకర్థం వారి అల్లుడు, కుమార్తె కొల్లు కృష్ణమోహన్, అనురాధ దంపతులు ఈ విరాళాన్ని ఆలయ ధర్మకర్త మద్దిపట్ల సత్యనారాయణకు అందచేశారు. గంగవరం, పోతినీడిపాలెం రోడ్ జంక్షన్‌లో అభయ ఆంజనేయస్వామి భారీ విగ్రహం ముందు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నాగబంధన ఆలయం దాదాపు పది లక్షల రూపాయలకు పైగా వ్యయంతో నిర్మిస్తున్నట్లు ధర్మకర్త సత్యనారాయణ తెలిపారు.

ఇఫ్టూ మహాసభలను జయప్రదం చేయండి


మహాసభల కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఇఫ్టూ నాయకులు

జంగారెడ్డిగూడెం: ఇఫ్టూ మహాసభలను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ధర్మన్న స్మారక భవనంలో శనివారం ఇఫ్టూ ఆలిండియా కమిటీ ప్రచురించిన కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 16, 17, 18 తేదీలలో ఆలిండియా ఇఫ్టూ మహాసభలు తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో కార్మిక ఉద్యోగ వర్గాలవారు హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవుల పుల్లారావు, కోట శివకృష్ణ, వనపర్ల నవీన్, ధర్మరాజు, టి.గణేష్, తమ్మా సోమలింగ మల్లికార్జునరావు, గోగుల చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సొసైటీ లక్ష్యం


సొసైటీ మహాజన సభలో జమాఖర్చులను వివరిస్తున్న కార్యదర్శి ప్రకాశరావు

లింగపాలెం : రైతుల సంక్షేమమే సొసైటీ లక్ష్యం అని ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్ అన్నారు. ధర్మాజీగూడెం సొసైటీ సహకార సంఘ మహాజన సభ స్థానిక కార్యాలయం ఆవరణలో సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సహకార సంఘ కార్యదర్శి ప్రకాశరావు 2022, 2023 మార్చి వరకు సంబంధించి సంఘంలో చేపట్టిన కార్యక్రమాలపై జమా, ఖర్చులను సభలో ప్రవేశపెట్టడంతో సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ సొసైటీ ద్వారా మొత్తం రూ.30 కోట్ల అందజేసినట్లు చెప్పారు. గతేడాది క్రాప్ రుణాల వసూళ్లు 94 శాతం, దీర్ఘకాలిక రుణాల వసూళ్లు 56 శాతం చేసినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : బాలిక అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కేతవరం గ్రామానికి చెందిన బాలిక జంగారెడ్డిగూడెం ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇంటర్ పరీక్షలు ముగియడంతో ఆమె ఇంటి వద్దనే ఉంటుంది. ఈ నెల 31న బాలిక తండ్రి పొలం నుంచి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద బాలిక లేకపోవడంతో చుట్టుపక్కలవారిని, బంధువుల ఇంటి వద్ద ఆచూకీ కోసం వెతికారు. ఫలితం లేకపోవడం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిబంధనల మేరకే మట్టితోలకాలు

కొయ్యలగూడెం: నిబంధనల మేరకే సాగునీటి చెరువుల నుంచి మట్టి తోలకాలు నిర్వహించాలని, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాల్సిందిగా ఏలూరు మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారని పీడబ్ల్యూడీ ఇరిగేషన్ ఏఈ సీహెచ్ భాస్కరరావు తెలిపారు. ఇరిగేషన్ శాఖ డివిజన్ పరిధిలోని రాజు చెరువు నుంచి నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నారన్న సమాచారంతో ఏడీ శనివారం తనిఖీ నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మట్టి తోలకాలు నిర్వహించాలని, అదేవిధంగా నిర్ణీత సమయానికి అనుమతి పొందిన క్యూబిక్ మీటర్ల మేర మాత్రమే మట్టి రవాణా చేయాల్సిందిగా సూచించారు అన్నారు.

పాడిపశువులకు గర్భధారణ ఇంజెక్షన్లు చేయించాలి

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : మేలు జాతి పశువుల అభివృద్ధి ద్వారా పాడిరైతులు ఆదాయాభివృద్ధి చెందేవిధంగా ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తుందని జీలుగుమిల్లి ప్రాంతీయ పశువర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.సాయి బుచ్చారావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి జులై 31వ తేదీ వరకు పాడి పశువులకు గర్భధారణ ఇంజెక్షన్లు అన్ని ప్రభుత్వ పశువర్ధక ఆస్పత్రులలో, రైతు భరోసా కేంద్రాల్లో వేస్తున్నట్లు తెలిపారు.